క్లుప్తంగా

విద్యార్థినికి ఆర్థిక సహకారం



లక్ష్మికి ఆర్థిక సహకారం అందజేస్తున్న కర్రి నీలకంఠం

అల్లిపురం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం బుధవారం వేంకటేశ్వరమెట్టపై నివసిస్తున్న అంపోలు లక్ష్మికి కాలేజీ ఫీజు నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. నాలుగు నెలల క్రితం ఆమె తండ్రి బంగారునాయుడు కిడ్నీ సమస్యతో మరణించారు. ఇంటర్‌లో 870 మార్కులు తెచ్చుకున్న లక్ష్మి బుల్లయ్య కాలేజీలో చేరేందుకు దరఖాస్తు చేసుకుంది. తండ్రి మణించడంతో కాలేజీ ఫీజు చెల్లించలేక అవస్థలు పడుతున్న విషయం తెలుసుకున్న కర్రి నీలకంఠం ఆమెకు ఆర్థిక సహకారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, శ్రీ వేంకట గౌరీ శంకర గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి శ్రీను పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు



విజయబాబుకు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ధర్మకర్తల మండలి సభ్యుడు

డాబాగార్డెన్స్ : రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు దంపతులు బుధవారం సిరులతల్లి కనకమహాలక్ష్మిని దర్శించుకున్నారు. దర్శనానికి విచ్చేసిన వారికి ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికి, అమ్మవారికి వారిచే విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యుడు సుబ్రహ్మణ్యం, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిపాలనా రాజధాని నిర్ణయం పట్ల హర్షం



సత్తిబాబు

మహారాణిపేట : విశాఖను పరిపాలనా రాజధాని చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం పట్ల విశాఖ వాసి, ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు హర్షం వ్యక్తం చేశారు. 3 రాజధానుల నిర్ణయంలో భాగంగా విశాఖను పరిపాలనా రాజధానిగా తీర్చిదిద్దేందుకు మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని అన్నారు. దసరా నుంచి విశాఖ నుంచే పరిపాలన జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించిన సందర్భంగా ఎన్నో ఏళ్ల నుంచి వేచి చూస్తున్న సమయం ఆసన్నమవుతుందని అన్నారు. విశాఖలో పుట్టి పెరిగిన వారిగా సంతోషం వ్యక్తం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, విశాఖకు తరలి రానున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, అధికారులకు సాదర స్వాగతం పలుకుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిర్ణయం వల్ల వెనుకబడిన ఉత్తరాంధ్ర ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖకు ఆ ప్రత్యేకత ఉండడం వల్లే నీతి ఆయోగ్ కూడా విశాఖను కూడా ముఖ్య నగరంగా ఎంపిక చేసినట్లు సత్తిబాబు పేర్కొన్నారు.

ఎఫ్‌సీఐలో వీడియో కాన్ఫరెన్స్

ఆరిలోవ: విశాఖ వేలీ స్కూల్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఐ)లో ప్రిన్సిపాల్ ఎ.వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విశాఖ ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో కోర్సుల సిలబస్ సవరణ కోసం ఏర్పాటు చేసిన ఈ వీడియో కాన్ఫెరెన్స్‌లో యూఎస్‌ఏ, నార్వేకు చెందిన హోటల్ ఇండస్ట్రీ ఎక్స్‌ఫర్ట్స్‌తో పాటు విశాఖపట్నం, హైదరాబాద్, బెంగుళూరు తదితర పట్టణాలలో హోటళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇళ్లలోకి ఇసుక మేటలు

- ఎమ్మెల్యే వాసుపల్లి సందర్శన
- అధికారులతో చర్చలు
- యుద్ధప్రాతిపదికన చర్యలు



వార్డుబాయి కాలనీలో అధికారులతో కలిసి ఇసుకమేటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 30వ వార్డు కేజీహెచ్ వార్డు బాయి కాలనీ వర్షం తాకిడికి తీవ్రంగా లోనయింది. వినాయక చవితి రోజు కురిసిన భారీ వర్షానికి ఈ ప్రాంతంలో గల పలు ఇళ్లల్లో ఇసుక మేట వేసింది. ఇంట్లో సామాన్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. ఇదిలా ఉండగా మంగళవారం అర్ధరాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి మళ్లీ ప్రళయం వచ్చినట్టు ఇసుక ఇళ్లల్లోకి చొరబడింది. దీంతో వార్డుబాయి కాలనీలో నివాసముంటున్న అనేక కుటుంబాలు ఇబ్బందులకు గురయ్యాయి.

ఎమ్మెల్యే సందర్శన..

ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆయా ప్రాంతాలను సంబంధిత అధికారులు, వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నంతో కలిసి బుధవారం పరిశీలించారు. కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణతో భేటీ అయ్యారు. కేజీహెచ్ ప్రహరీకి ఆనుకుని ఉన్న ఇసుక కొండ నుంచి ఇసుక దొర్లి వార్డుబాయి కాలనీకి చేరకుండా ఉండేలా రక్షణ గోడ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు. అంతే కాక కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునతో మాట్లాడి నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం అందజేయాలని, భవిష్యత్‌లో ఇటువంటి పరిణామాలు జరగకుండా ఉండేలా రక్షణగోడ నిర్మాణం చేపట్టాలని కోరారు. జోనల్ కమిషనర్ శివప్రసాద్‌తో మాట్లాడి బాధిత కుటుంబాలకు జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇళ్లల్లోకి చేరిన ఇసుకను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం, అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, జేసీఎస్ ఇన్‌చార్జి కోన శంకర్, సత్యనారాయణ, దేవరాజు, వడ్డాది దిలీప్, దశమంతుల చిన్ని, కోరిబిల్లి ఆనంద్, రాము, సూరిబాబు, మీనా, కల్యాణి, జ్యోతి, రెవెన్యూ అధికారులు, పార్టీ కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

2024 ఎన్నికల్లో సీఎం జగన్ గెలుపే లక్ష్యం



ఎమ్మెల్యేని గజమాలతో సత్కరిస్తున్న నియోజకవర్గ మండల అధ్యక్షులు

డాబాగార్డెన్స్ : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, నియోజకవర్గ ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించుకుంటామని ఇటీవల మండల అధ్యక్షులుగా నియమితులైన దొడ్డి బాపూ ఆనంద్, కర్రి నీలకంఠం, పీతల వాసు, కొల్లి సింహాచలం తెలిపారు. ఎమ్మెల్యే వాసుపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం ఎమ్మెల్యేను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నందుకు, నియోజకవర్గం పరిధిలో ఇటీవల నాలుగు క్లస్టర్లలో మండల అధ్యక్షులుగా తమను నియమించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. సీఎం జగన్ ఆదేశాలు, ఉత్తరాంధ్ర జిల్లాల కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యే వాసుపల్లి చొరవతో మండల అధ్యక్షులుగా నియమించడం సంతోషకరమన్నారు. పార్టీ బలోపేతానికి, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని సీట్లలో గెలిచేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, పలు విభాగాల డైరెక్టర్లు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

మహోన్నత వ్యక్తి అక్కినేని



ఏఎన్నార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోలా గురువులు, అభిమానులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే అక్కినేని యువసేన సభ్యులు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, ప్లాటినం జూబ్లీ హీరో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు జయంతి ఉత్సవాలను పాతపోస్టాఫీసు స్వామి వివేకానంద వృద్ధాశ్రమంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర సీమలో ఏఎన్నార్ మహోన్నతమైన వ్యక్తని, ఎన్నో విజయాలతోపాటు అవార్డులు అందుకున్న గొప్ప కథా నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో బొబ్బిలి సీనియర్ అక్కినేని అభిమాని లంక వాసుదేవరావు, రైల్వే అక్కినేని యువసేన సభ్యులు ఈశ్వరరావు, కె.శ్రీనివాసరావు, డి.వి.సంతోష్, కల్యాణి శ్రీనివాస్, ఏఎన్నార్ అభిమానులు దండల శ్రీను, చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

బహురూపాయ.. గణేశాయ



కొబ్బరితోటలో ఏర్పాటు చేసిన బుజ్జాయి గణపతి



మహావిష్ణువు ఒడిలో బాల గణేషుడు

అల్లిపురం : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో గణేషుడు బహు రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నాడు. 34వ వార్డు కొబ్బరితోటలో యువత ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

గణపతిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గణపతికి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అల్లిపురం : వేంకటేశ్వరమెట్ట శ్రీ వేంకట గౌరీ శంకర గ్రంథాలయం వద్ద ఆర్ఎక్స్ 100 బాయ్స్ ఏర్పాటు చేసిన గణపతిని 33వ వార్డు వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, భీశెట్టి రాజు, సంతోష్ తదితరులు బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కనుల పండువగా దీపారాధన



మంచు శివలింగం చుట్టూ ఏర్పాటు చేసిన దీపాలు

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీలో కాలనీ హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్, యువత ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా విశేషంగా దీపారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మంచు శివలింగం ఆకట్టుకుంది. 1008 దీపాలతో ఏర్పాటు చేసిన దీపారాధనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ సేవలపై అవగాహన



మాట్లాడుతున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కూడలిలో తపాలా శాఖ ఆధ్వర్యంలో బుధవారం డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో తక్కువ ప్రీమియంతో అధిక బోనస్ ఇచ్చే ప్లాన్స్ ఉన్నాయని తెలిపారు. చిన్న చిన్న మొత్తాల్లో పొదుపు జమ చేసి భవిష్యత్ అవసరాలకు పెద్ద మొత్తంలో అందుకునేలా చాలా రకాల పొదుపు పథకాలు ఉన్నాయన్నారు. తపాలా శాఖ సీనియర్ మేనేజర్ కె.శ్రీదేవి, మేనేజర్ ఎస్.సంతోష, ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ, పోస్ట్ మాస్టర్ బి.యేసు, సిబ్బంది తపాలా శాఖ అందిస్తున్న పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

దేశభక్తి గీతాలపై పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సాహితీ స్రవంతి ప్రతినిధులు

మురళీనగర్: మహాకవి గురజాడ అప్పారావు జయంతి వారోత్సవాల సందర్భంగా కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో సాహితీ స్రవంతి సంస్థ, లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన 'గురజాడ ఆశించిన సమాజం ఫలించిందా?' అనే అంశంపై వక్తృత్వ పోటీలు జరిగాయి. విజేతలు పి.దిలీప్, ఎస్.ఎల్.ఎస్. వర్ధన్, ఈ.రవళి, వై.వందనకు సాహితీ స్రవంతి ప్రతినిధులు, ప్రిన్సిపాల్ వెంకటరమణ బహుమతులు అందజేశారు. వక్తలు మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి గురజాడ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, సాహితీ స్రవంతి సభ్యులు ఎం.ఆనంద శర్మ, ఆంథోనీ, వెంకట్, వసంత కుమార్, పి.ఫ్రాన్సిస్, పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత



మృతుడి భార్యకు తక్షణ సహాయం అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శివాజీనగర్-2లో ఇటీవల అనారోగ్యంతో రాయిపల్లి ఆనందరావు మృతి చెందారు. ఆయనకు వైఎస్ఆర్ బీమా వర్తించింది. దీంతో అతని భార్యకు బుధవారం సంబంధిత సచివాలయం సిబ్బంది, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తక్షణ సహాయం కింద రూ.10 వేల అందజేశారు. మిగిలిన రూ.90 వేలు బ్యాంక్ ఖాతాలో కొద్ది రోజుల్లో జమచేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వైఎస్సార్‌సీపీ స్థాక నాయకులు కెల్ల సత్యనారాయణ, పోలరావు, దుర్గారావు, వెంకటరెడ్డి, శ్రీను, రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళా బిల్లు ఆమోదం హర్షణీయం



వేడుకలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఎంవీపీ కాలనీ: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడం హర్షణీయమని జిల్లా బీజేపీ నాయకులు అన్నారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీలోని సమత కళాశాలలో బుధవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ చారిత్రాత్మకమైన ఈ బిల్లును కొత్త పార్లమెంట్ భవనంలో ఆమోదం పొందడం అభినందనీయమన్నారు. దేశ జనాభాలో 50 శాతం ఉన్న మహిళలకు ఈ బిల్లు ద్వారా సముచితస్థానం లభిస్తుందన్నారు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు చట్టసభలకు ఎంపికై రాజకీయాల్లోను వారి చాతుర్యాన్ని చాటనున్నారని చెప్పారు. ఈ బిల్లు ఆమోదంతో ప్రధాని మోదీకి దేశంలోని మహిళలు అందరూ నీరాజనాలు పలుకుతున్నారన్నారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ టపాసులు కాల్చడంతో పాటు ప్రధాని చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, మహిళ అధ్యక్షురాలు సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



మహిళకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : ఆపదలో ఉన్నవారికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలుస్తున్నారు. అడిగిందే తడవుగా ఆయన వారిని పరామర్శించి సహాయం అందజేస్తున్నారు. దీంట్లో భాగంగా ఆయన బుధవారం 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్ ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బాలకృష్ణ బావ లెంక రామ్మూర్తి క్యాన్సర్‌తో బాధ పడుతున్నాడన్న విషయం తెలుసుకుని వారింటికి వెళ్లి పరామర్శించి మందుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. 38వ వార్డు గాంధీబొమ్మ ప్రాంతంలో నివసించే గౌరవ సూరి పెరాలసిస్‌తో బాధపడుతున్నట్లు తెలుసుకుని అతనిని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. అదే వార్డుకు చెందిన వాడమోదుల సందీప్‌కుమార్ బోన్‌మేరా క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకుని పరామర్శించి రూ.5 వేలు అందజేశారు. చావలవారి వీధి ప్రాంతానికి చెందిన చిప్పాడ పార్వతి పెరాలసిస్‌తో బాధపడుతున్నట్లు తెలుసుకుని, ఆమె ఇంటికి వెళ్లి రూ.5 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. ఈ సందర్భంగా సహకారం అందుకున్నవారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, వార్డు ప్రెసిడెంట్ అలపన కనకరెడ్డి, 38వ వార్డు అధ్యక్షుడు శంకాభక్తుల సన్యాసిరావు, స్టేట్ డైరెక్టర్ సనపల రవీంద్ర భరత్, ఎస్సీసెల్ అధ్యక్షుడు బోణి దేవ, దుర్గాలమ్మ గుడి చైర్మన్ నాయని మల్లిబాబు, ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్ నేరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు తదితరులు



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న మైనర్లు, వారి తల్లిదండ్రులు

- ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు

అల్లిపురం : మైనర్ డ్రైవింగ్ నేరమని ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం కూడా నేరమేనని ఆయన స్పష్టం చేశారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు నగరంలో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్లు, వారి తల్లిదండ్రులకు బుధవారం పోలీస్ కమిషనరేట్‌లో గల పోలీస్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడీసీపీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతూ చాలామంది ప్రాణాలు పోగొట్టుకున్నారని గుర్తు చేశారు. వారిలో కొంత మందికి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. వీరిలో ఎక్కువ శాతం యువకులు ఉండడం బాధాకరమన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మంది మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్ వలన జరిగినవేనన్నారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలను పవర్ పాయింట్, లైవ్ వీడియోలు, ఫొటోల ద్వారా వివరించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం వాహనదారులతో పాటు పాదచారులు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు పలు సూచనలు, జాగ్రత్తలతో కూడుకున్న కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ-1, ఏసీపీ-2, ట్రాఫిక్ సీఐలు పాల్గొన్నారు.

మురుగు నీటితో ముప్పతిప్పలు



మసీదు రోడ్డులో పేరుకుపోయిన చెత్త (మల్టీ లెవల్ కారు పార్కింగ్ ప్రాంతం)

- చెత్తా చెదారాలతో అస్తవ్యస్తంగా మసీదు రోడ్డు
- దేవర వీధిలో ప్రవహిస్తున్న మురుగు



దేవర వీధి వద్ద ఓ వైపు మంచినీటి బోరు.. మరోవైపు ఉప్పొంగిన మురుగు నీరు

డాబాగార్డెన్స్ : ఏ పాటి చిన్న వర్షం కురిసినా నగర రోడ్లు మురుగునీటితో నిండుతున్నాయి. ఎక్కడ చూసినా కాల్వల ద్వారా మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో కాల్వల్లో చెత్త పేరుకుపోవడం వల్ల మురుగునీటి ప్రవాహం సజావుగా సాగక రోడ్లను మురుగు ముంచెత్తుతుంటే.. ఏళ్ల తరబడి కొన్ని సమస్యలు పరిష్కారం కాక చెత్తా చెదారాలతో అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను వేడుకుంటున్నా.. సమస్య పరిష్కారం కావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. తాజాగా.. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలో గల మల్టీ లెవల్ కార్ పార్కింగ్ వద్ద కాల్వ నుంచి మురుగు నీరంతా రోడ్డుపైకి వచ్చేయడంతో చెత్తా, చెదారాలతో రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. ఇదిలా ఉండగా.. కిలోమీటర్ మేర మురుగు నీరు ప్రవహించడంతో పరిసర ప్రాంతాలు.. వీధుల్లో మురుగు ముంచెత్తింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు వేడుకుంటున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అన్నానగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డులో పలు అభివృద్ధి పనులకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి బుధవారం శ్రీకారం చుట్టారు. తోటగరువు దరి అన్నానగర్‌లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం కోసం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వార్డులో అన్ని కాలనీల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రోడ్లు, కాలువలు, సామాజిక భవనాల నిర్మాణంతో పాటు గెడ్డల ఆధునికీకరణ కూడా పూర్తి చేసినట్టు చెప్పారు. అన్నానగర్‌లో రూ.45 లక్షలు జీవీఎంసీ నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నగరం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. సీఎం ఆదేశాలతో జీవీఎంసీ పరిధిలో అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టి నగరం సుందరీకరణకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, కొరికాన మోహనరావు, ఒమ్మి చిన్నారావు, ఒమ్మి రామారావు, సతీష్, స్థానిక పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.